WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramteiugudaily@gmail.com

# నవతరం

హైదరాబాద్ సంపుటి : 9 సంచిక : 210 బుధవారం, జూలై 29, 2026, పేజీలు - 4 వెల: 5/-

## ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ వల్ల
# సమస్యలు ఎక్కువ వస్తున్నాయి



**న్యూ ఢిల్లీ :** దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ,, ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ వల్ల సమస్యలు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్? చేశారు. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోందని, యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు. విద్య, వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయని తెలిపారు. గ్లోబరీనా వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి : కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై ఆలోచిస్తామని సీఎం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామని, రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందని, గ్లోబరీనా వంటి సంస్థలు నాడు తెలంగాణలో అక్రమాలకు పాల్పడ్డాయని, నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల సీబీఎస్ఈకి విస్తరించారని, గ్లోబరీనా వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య ఉండదు : కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో చట్టాలు రూపొందిస్తామని, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కొట్టేయాలని చూసిన సంస్థలపై విచారణ జరుగుతోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బకాయి పెట్టిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూ. 8 వేల కోట్లు భారంగా మారిందని అన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ తాము ఇవ్వట్లేదనే భ్రమలు కల్పించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై రామచందర్‌రావు, ఆర్. కృష్ణయ్య పదేపదే ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఏపీలో రూ. 10 వేల కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆర్. కృష్ణయ్య ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ రాష్ట్రంలో బకాయిలపై మాట్లాడరని సీఎం తెలిపారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంది.. అక్కడ బకాయిలపై మాట్లాడాలని, ఏపీలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించాక తెలంగాణ గురించి మాట్లాడితే బాగుంటుందని సూచించారు. ఏ ఏడాదికి సంబంధించిన బకాయిలు అదే ఏడాది చెల్లిస్తామని, ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రణాళికలు రచించామని, భవిష్యత్తులో ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య తెలంగాణలో ఉండదని స్పష్టం చేశారు. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం. యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోంది. విద్య వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయి.

## విద్యార్థులు ఏమైనా
# ఉగ్రవాదులా?



**న్యూ ఢిల్లీ :** నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడంపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ మండిపడ్డారు. విద్యా ర్థులను పోలీసులు లాఠీలతో కొట్టారని, బాష్పవాయువు ప్రయోగించా రని, ముఖ్య ంగా బాలికల వస్త్రాలు లాగి, అసభ్యంగా, అమానుషంగా ప్రవర్తించారని ఆరోపి ంచారు. జరిగిన అక్రమాలపై పోరాడుతున్న యువతపై పెల్లెట్ గన్స్, ఏకే-47 ప్రయో గించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా? అని మోదీ సర్కార్?ను లోక్‌సభలో నిలదీశారు. విద్యార్థులపై టియ ర్ గ్యాస్, లాఠీఛార్జ్, వాటర్ క్యానన్లు ప్రయో గించాల్సిన అవసరం ఏమొచ్చింది? యువ తులను అవమానిస్తూ, వారి బట్టలు చించి, దారుణంగా కొట్టించాల్సిన అవసరం ఏము ంది? దేశ యువతపై పెల్లెట్ గన్స్, ఏకే-47 ప్రయోగించాల్సిన ఏమొచ్చింది?

## పోలీసుల తీరుపై
# సీజేఐ ఆగ్రహం.



**న్యూ ఢిల్లీ :** జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ నిరసనకారులపై పోలీసులు జరిపిన లాఠీచార్జ్, బలప్రయోగంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శాంతియుత నిరసనలను అణచివేయడంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. బాధ్యులైన అధికారులను తేల్చేందుకు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసులు చేసిన దాడిలో ఓ యువకుడు కంటిచూపు కోల్పోయాడని, ఒక యువతి ఐసీయూలో చేరిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిరసనకారులపై మేకులు ఉన్న లాఠీలు, ఎలక్ట్రిక్ బ్యాటన్లు ఇంకా పెల్లెట్ గన్లను వాడటంపై సుప్రీంకోర్టు తీవ్రంగా మండిపడింది. సాధారణ దుస్తుల్లో ఉన్నవారు కూడా ఆందోళనకారులపై దాడులకు పాల్పడ్డారని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రజాస్వామ్యంలో నిరసనలు వ్యక్తంచేసే హక్కు అందరికీ ఉందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఆందోళనలను నియంత్రించే సమయంలో పోలీసులు పరిమితులు దాటకూడదని, గతంలో కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను తుంగలో తొక్కారని వ్యాఖ్యానించింది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా టియర్ గ్యాస్, లాఠీచార్జ్ వాడకంపై కొత్త పోలీసు ప్రోటోకాల్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని సూచించింది.

## ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కోవడంలో
# 'రైతునేస్తం' కీలక పాత్ర:

**హైదరాబాద్, జులై 28**




రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరా వు అన్నారు. (మంగళవారం) రైతు నేస్తం 100వ ఎపిసోడ్‌ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాల యం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు - శాస్త్రవేత్త - అధికారుల అనుస ంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకు ందని తెలిపారు. ఇప్పటివరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయో జనం చేకూరినట్లు వెల్లడించారు. ప్రతి మంగళ వారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తల సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్-నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు. జులైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందని ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.

## హైడ్రా అధికారిగా ఎవరిని నియమించాలనే
# విచక్షణ ప్రభుత్వానికి ఉంది



**న్యూఢిల్లీ, జులై 28:** హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జా కోర్లు హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి విలే కర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరు కోమని స్పష్టం చేశారు. గండిపేట బతుకమ్మ కుంటలను ఆక్రమిం చింది పేదలా? పెద్దలా? అని వి పక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దల దా? అని వారిని నిలదీశారు. హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభి వర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమిం చాలనే విచక్షణ తమ ప్రభుత్వా నికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులు న్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు.

## అంతర్జాతీయ సంస్థలతో
# ఏపీ ప్రభుత్వం ఒప్పందం.



**అమరావతి, జులై 28:** ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో మరో ముఖ్యమైన అడుగు పడింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ మరియు క్యూర్ ఏఐ సంస్థలతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పం దాలు కుదు ర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షం లో ఈ ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా అమరావతిలో దేశంలోనే తొలి సారిగా 'ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ ఆంకా లజీ' విధానాన్ని అందుబాటులోకి తీసుకు రానున్నారు. 1. అమరావతిలో అధునాతన క్యాన్సర్ పరీక్షల కేంద్రంఈ కేంద్రం ద్వారా ముఖ్యంగా ఊపిరితిత్తులు మరియు రొమ్ము క్యాన్సర్ బాధితులకు అవసరమైన అధునాతన జన్యు పరీక్షలు చేస్తారు. దీనివల్ల క్యాన్సర్ వ్యాధిని ముందే గుర్తించి, రోగులకు మరింత వేగంగా, కచ్చితమైన వైద్యం అందించడానికి వీలవుతుంది. 2. అందరికీ తక్కువ ధరలోనే నాణ్యమైన వైద్యంఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆయన సూచించారు. ఈ భాగస్వామ్యంతో ఏపీ హెల్త్‌కేర్ -- రీసెర్చ్ రంగాలు సరికొత్త ఎత్తుకు ఎదుగుతాయని నిపుణులు విశ్వసిస్తున్నారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్
# కృష్ణారెడ్డి అరెస్ట్



**హైదరాబాద్, జులై 28:** సహచర ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదు నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శంకరపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసు దర్యాప్తును ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ బదిలీ చేశారు. స్పందించిన రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డినీ చట్ట పరిధిలో ప్రొసీజర్ ప్రకారం విచారిస్తామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో డీసీపీ మాట్లాడుతూ.. ఈ కేసులో నమోదైన సెక్షన్లు, ఆధారాలు బేస్ చేసుకొని అతడిని విచారిస్తామని చెప్పారు. అరెస్టు చేయాలా? లేక నోటీసులు ఇచ్చి విచారించాలా? అనేది అతడిపై నమోదైన సెక్షన్స్‌పై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఉదయ్ కృష్ణారెడ్డిపై కొన్ని అభియాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై పూర్తి సమాచారాన్ని తర్వాత వెల్లడిస్తామని అన్నారు. ఈ కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతుందని డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు
# హైడ్రామా



**న్యూఢిల్లీ, జులై 28:** నీట్-యూజీ 2026 ప్రశ్న పత్రం లీక్ వివాదంతో ప్రారంభమైన ఆందోళనలు, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీశాయి. అయితే మొదట ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కంటే ముందు ఆయనను వేరే శాఖకు మార్చాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రశ్న పత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులతో జరిపిన తొలి చర్చల్లో కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్ శాఖను మాత్రమే మార్చే ప్రతిపాదనను చేసిందని సమాచారం. అయితే ఆ ప్రతిపాదనను సీజేపీ ప్రతి నిధులు పూర్తిగా తిరస్కరి ంచినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను బీజేపీ ఖండించింది. అవి పూర్తిగా నిరాధారమైనవని, కల్పిత మైనవని పేర్కొంది. ఈ అంశం పై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇదన్నారు. ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదని చెప్పారు. ఇవన్నీ నిరాధార కథనాలేనని కొట్టిపారేశారు. కేవలం సంచలనాల కోసం ఇలాంటి అసత్య వార్తలను వ్యాప్తి చేయవద్దని హితవు పలికారు.

# “ప్రజల గొంతు మూగబోతే ప్రజాస్వామ్యం బతకదు”

- ప్రముఖ సామాజిక వేత్త జుత్తు తాతారావు తో నవతరం ప్రత్యేక ఇంటర్వ్యూ
- రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత”



**ఇంటర్వ్యూ: నవతరం ప్రతినిధి తేదీ: జూలై 27, 2026**

దేశంలో గత రెండు నెలలుగా జరుగుతున్న విద్యార్థి ఉద్యమాలు, జాతీయ స్థాయి పరీక్షల్లో అవకతవలు, నిరుద్యోగ సమస్య, ప్రజాస్వామ్య విలువలపై వస్తున్న ప్రశ్నలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ, యువత భవిష్యత్తు వంటి అంశాలపై సమాజంలో లోతైన అవగాహన ఉన్న ప్రముఖ సామాజిక వేత్త జుత్తు తాతారావు గారితో నవతరం ప్రతినిధి ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. ప్రస్తుత సంక్షోభానికి మూలాలు, ప్రభుత్వ బాధ్యతలు, యువత పాత్ర గురించి ఆయన వివరంగా మాట్లాడారు.

**ప్ర: సార్, ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఉద్యమాలను మీరు ఎలా చూస్తున్నారు?**

జుత్తు తాతారావు: ఇది చాలా శుభ పరిణామం. చాలా కాలం తర్వాత యువత తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చింది. కేవలం ఉద్యోగాలు, పరీక్షల కోసమే కాదు, ఈ దేశ భవిష్యత్తు కోసం వాళ్లు గొంతు ఎత్తారు. “ప్రజల గొంతు మూగబోతే ప్రజాస్వామ్యం బతకదు” అని ఈ ఉద్యమం నిరూపించింది. ప్రభుత్వం తప్పు చేసినప్పుడు ప్రశ్నించే ధైర్యం యువతలో వచ్చింది. ఇదే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఈ ఉద్యమం రాజకీయాలకు అతీతంగా సాగింది. అదే దీని గొప్పతనం.

**ప్ర: రాజ్యాంగం గురించి నేటి యువతలో అవగాహన తగ్గుతోందని అంటారు. మీ అభిప్రాయం?**

జుత్తు తాతారావు: అవును, కొంతవరకు నిజమే. రాజ్యాంగం అంటే ఏదో పార్లమెంటులో పెట్టిన పుస్తకం అనుకుంటున్నారు. కానీ రాజ్యాంగమే మన జీవితం. మనకు మాట్లాడే హక్కు, చదువుకునే హక్కు, సమానంగా బతికే హక్కు, ఓటు హక్కు అన్నీ రాజ్యాంగం ఇచ్చినవే. డాక్టర్ అంబేద్కర్ చెప్పినట్టు “రాజ్యాంగం ఎంత మంచిదైనా దాన్ని అమలు చేసేవారు చెడ్డవారైతే అది చెడ్డదిగా మారుతుంది.” అందుకే ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని చదవాలి. తన హక్కులేమిటో, విధులేమిటో తెలుసుకోవాలి.
సంస్కృతంలో ఒక మాట ఉంది “ధర్మో రక్షతి రక్షితః” అంటే ధర్మాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుంది. రాజ్యాంగం కూడా అంతే. మనం దాన్ని గౌరవిస్తే అది మనల్ని కాపాడుతుంది.

**ప్ర: ప్రజాస్వామ్యం బలహీనపడుతోందనే వాదనలు వస్తున్నాయి. దీనికి కారణం ఏమిటి?**

జుత్తు తాతారావు: ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకు ఒకసారి ఓటు వేయడం కాదు. ప్రతిరోజూ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం. అబ్రహం లింకన్ చెప్పినట్టు “ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజలే నడిపే పాలన” అది. ఈరోజు ఏమవుతోంది? డబ్బు, మద్యం, కులం పేరుతో ఓట్లు కొంటున్నారు. ప్రజా సమస్యలపై శాసనసభల్లో చర్చ లేదు. నిరుద్యోగం, విద్య, వైద్యం వంటి ముఖ్యమైన సమస్యలను పక్కన పెడుతున్నారు.
మహాత్మా గాంధీ చెప్పారు “ఏ ఒక్క వ్యక్తిని కూడా అణచివేయని పాలనే నిజమైన ప్రజాస్వామ్యం.” కానీ ఈరోజు ప్రశ్నించే వారిని, విమర్శించే వారిని దేశద్రోహులుగా చిత్రీకరించే ధోరణి పెరిగింది. ఇది ప్రమాదకరం. ప్రజాస్వామ్యం అంటే భిన్నాభిప్రాయాలకు చోటు ఉండాలి.

**ప్ర: పత్రికా స్వేచ్ఛ గురించి మీరు ఏమంటారు? అంతర్జాతీయంగా మన దేశం ర్యాంకింగ్ ఎలా ఉంది?**

జుత్తు తాతారావు: పత్రికా స్వేచ్ఛ అంటే ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం. ప్రభుత్వం తప్పు చేస్తే దాన్ని ఎత్తి చూపాల్సిన బాధ్యత పత్రికలది. ప్రజలకు నిజమైన సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత పత్రికలది.కానీ బాధాకరమైన విషయం ఏమిటంటే అంతర్జాతీయంగా పత్రికా స్వేచ్ఛ విషయంలో మన దేశ ర్యాంకింగ్ ఏటా దిగజారుతోంది. రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్ సంస్థ ఇచ్చే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో మన దేశం గత కొన్ని సంవత్సరాలుగా 150వ స్థానం దగ్గర నిలుస్తోంది. ఇది 180 దేశాల్లో మనం ఎక్కడ ఉన్నామో చెప్తుంది. ఇది ప్రజాస్వామ్య దేశానికి మంచి సంకేతం కాదు.ప్రముఖ జర్నలిస్ట్ జోసెఫ్ పులిట్జర్ అన్నారు “సమాజంలో తప్పు జరుగుతుంటే దాన్ని ఎత్తి చూపే ధైర్యం పత్రికలకు ఉండాలి. లేకుంటే ప్రజాస్వామ్యం అంధకారంలోకి వెళ్తుంది.” ఇటీవల పరీక్షల లీకులు, అవినీతి కుంభకోణాలు బయటకు రావడానికి పత్రికలే కారణం. కానీ ఈరోజు పత్రికలపై వాణిజ్య ఒత్తిళ్లు, రాజకీయ ఒత్తిళ్లు, జర్నలిస్టులపై దాడులు పెరిగాయి. టీఆర్పీ కోసం, ప్రకటనల కోసం నిజాన్ని వక్రీకరిస్తున్నారు. మౌలానా ఆజాద్ చెప్పినట్టు “స్వేచ్ఛాయుత పత్రికలు లేని దేశం, కళ్ళు లేని మనిషితో సమానం.” అందుకే స్వతంత్ర పత్రికలను కాపాడుకోవాలి. లేకుంటే మన ర్యాంకింగ్ ఇంకా దిగజారుతుంది.

**ప్ర: విద్యా వ్యవస్థలో జరుగుతున్న వాణిజ్యీకరణను మీరు ఎలా చూస్తారు? దీని ప్రభావం ఏమిటి?**

జుత్తు తాతారావు: ఇది దేశానికి అతిపెద్ద ప్రమాదం. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చేశారు. పేదవాడి పిల్లాడు డాక్టర్ కావాలన్నా, ఇంజనీర్ కావాలన్నా లక్షలు కావాలి. కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ కళాశాలలు పుట్టగొడుగుల్లా పెరిగాయి. ఒక పేద తల్లిదండ్రులు పొలం అమ్మి, అప్పులు చేసి పిల్లల్ని చదివిస్తారు. అలాంటి సమయంలో పరీక్ష పేపర్ లీక్ అయితే వాళ్ల జీవితం నాశనం అవుతుంది. ఇది రాజ్యాంగంలోని సమాన అవకాశాల హక్కుకు విరుద్ధం. విద్యను మళ్లీ ప్రభుత్వమే నాణ్యమైన, ఉచిత సేవగా బాధ్యతగా తీసుకోవాలి. లేకుంటే ఈ దేశంలో అసమానతలు ఇంకా పెరుగుతాయి.

**ప్ర: యువతకు, సామాన్య ప్రజలకు మీ సందేశం ఏమిటి?**

జుత్తు తాతారావు: మూడు మాటలు చెప్తాను.
మొదటిది: భయపడవద్దు. ప్రశ్నించండి. రాజ్యాంగం మీకు ఆ హక్కు ఇచ్చింది. రెండవది: ఓటును అమ్ముకోవద్దు. ఓటు మీ ఆయుధం. ఆలోచించి, విచక్షణతో వేయండి. మూడవది: చదవండి. చరిత్ర చదవండి. రాజ్యాంగం చదవండి. నకిలీ వార్తలను నమ్మవద్దు. నిజాన్ని తెలుసుకోండి.“సర్వే జనాః సుఖినో భవంతు” అందరు సుఖంగా ఉండాలన్నదే మన సంస్కృతి. ఆ స్ఫూర్తితో పని చేయండి. మీరు మౌనంగా ఉంటే అవినీతి పెరుగుతుంది. మీరు నిలబడితే దేశం నిలబడుతుంది.

**ప్ర: చివరిగా ప్రభుత్వానికి, పాలకులకు మీరు ఇచ్చే సూచన?**

జుత్తు తాతారావు: ప్రజలను శత్రువులుగా చూడవద్దు. ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేయవద్దు. ప్రజల సమస్యలు ఓపికగా వినండి. పారదర్శకంగా పని చేయండి. “పాలకులు ప్రజల సేవకులు, యజమానులు కాదు” అనే సంగతి గుర్తుంచుకోండి. రాజ్యాంగాన్ని గౌరవిస్తే, పత్రికా స్వేచ్ఛను కాపాడితే, మన అంతర్జాతీయ ర్యాంకింగ్ మెరుగుపడితే ఈ దేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది. లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు కాదు. ప్రతిరోజూ ప్రజల జీవితంలో కనిపించాలి. అప్పుడే రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరుతాయని జుత్తు తాతారావు ఈ సందర్భంగా అన్నారు.

# రేపు శ్రీకాకుళం జిల్లాలో వైయస్ జగన్ పర్యటన

- “అక్రమ కేసుల్లో చిక్కిన నాయకులకు అండగా ఉంటాం”
- అంపోలు జైలులో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ములాఖత్
- వైఎస్సార్‌సీపీ నాయకులకు పూర్తి భరోసా




**పలాస, నవతరం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఎల్లుండి అంటే జూలై 30, 2026 గురువారం నాడు శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు మంగళవారం పలాసలో ఒక ప్రకటన విడుదల చేశారు.అక్రమ కేసులో అరెస్ట్ అయి శ్రీకాకుళం సమీపంలోని అంపోలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజును వైయస్ జగన్ ములాఖత్ ద్వారా కలుసుకోనున్నారని ఆయన తెలిపారు. రాజకీయ కక్షతో అప్పలరాజుపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపారని ఆరోపిస్తూ ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున పూర్తి భరోసా కల్పించేందుకే ఈ పర్యటన చేపడుతున్నట్లు బమ్మిడి దుర్యోధన రావు పేర్కొన్నారు.రాష్ట్రంలో అధికార పార్టీ కక్షపూరితంగా పనిచేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని, అలాంటి వేధింపులకు గురవుతున్న ప్రతి కార్యకర్తకు, నాయకుడికి పార్టీ అండగా నిలుస్తుందని వైయస్ జగన్ స్పష్టం చేయనున్నారని ఆయన అన్నారు. జైలులో ఉన్న మాజీ మంత్రిని కలిసిన అనంతరం సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులతోనూ శ్రీ వైయస్ జగన్ మాట్లాడనున్నారని తెలిపారు.ఈ పర్యటన ద్వారా శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకుల్లో, కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపేందుకు ప్రయత్నించనున్నారని బమ్మిడి దుర్యోధన రావు పేర్కొన్నారు. రాజకీయ వేధింపులను ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలుగా తోడుగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# “విద్యను వ్యాపారం చేస్తే దేశ భవిష్యత్తును తాకట్టు పెట్టినట్లే”

**-ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ ఉలాల కోదండ**
**-రామ్ యాదవ్ తో నవతరం ప్రత్యేక ఇంటర్వ్యూ**
**- “పరీక్షల పవిత్రత కాపాడకపోతే యువత విశ్వాసం కోల్పోతుంది”**



**ఇంటర్వ్యూ: నవతరం ప్రతినిధి తేదీ: జూలై 27, 2026। స్థలం: ఇచ్ఛాపురం**

ఇచ్ఛాపురం: జాతీయ స్థాయి పరీక్షల్లో వరుసగా జరుగుతున్న అవకతవలు, ప్రశ్నాపత్రాల లీకులు, దీనిపై దేశవ్యాప్తంగా రెండు నెలలుగా సాగిన యువత ఉద్యమం దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. విద్యారంగంలోని లోపాలు, యువత భవిష్యత్తు, శాశ్వత పరిష్కారాల గురించి ప్రముఖ సామాజిక వేత్త, విద్యా రంగంపై లోతైన అవగాహన ఉన్న డాక్టర్ ఉలాల కోదండ రామ్ యాదవ్ గారితో నవతరం ప్రతినిధి ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. ప్రస్తుత సంక్షోభానికి మూలాలు, ప్రభుత్వ వైఫల్యాలు, యువత పాత్రపై ఆయన వివరంగా స్పందించారు.

**ప్ర: సార్, ఈ మధ్య జరిగిన ఉద్యమం గురించి మీ అభిప్రాయం ఏమిటి?**

డాక్టర్ కోదండ రామ్ యాదవ్: ఇది కేవలం ఒక పరీక్ష కోసం జరిగిన ఆందోళన కాదు. ఇది యువత ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటం. దాదాపు రెండు నెలలుగా యువత రోడ్లపైకి వచ్చింది. చివరకు ప్రభుత్వం దిగివచ్చి బాధ్యత వహించాల్సి వచ్చింది. “ఒక్క పరీక్షతో లక్షల జీవితాలను ఆడుకుంటే యువత ఊరుకోదు” అని ఈ ఉద్యమం నిరూపించింది. ఇది చరిత్రలో ఒక మైలురాయి. ఇంతకు ముందు ఇంత పెద్ద ఎత్తున విద్యార్థులు ఏకమై పోరాడిన సందర్భం చాలా తక్కువ.

**ప్ర: పరీక్షల్లో లీకులు కొత్త కాదు కదా? ఇప్పుడు ఎందుకు ఇంత పెద్ద సమస్యగా మారింది?**

డాక్టర్ కోదండ రామ్ యాదవ్: గతంలో లీకులు అప్పుడప్పుడు జరిగేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. మొదటిది విద్య పూర్తిగా వ్యాపారమైపోయింది. రెండవది ప్రతి విషయానికి ఒక్కటే పరీక్ష. వైద్యం కావాలన్నా, ఇంజినీరింగ్ కావాలన్నా, ఉద్యోగం కావాలన్నా ఒకే పరీక్ష. ఒక కుటుంబం లక్షలు ఖర్చు పెట్టి పిల్లల్ని చదివిస్తుంది. అలాంటి సమయంలో పేపర్ లీక్ అయితే ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. మూడవది సమాచార సాధనాల వల్ల సమాచారం క్షణాల్లో వ్యాపిస్తోంది. అందుకే యువతలో ఆగ్రహం ఉవ్వెత్తున ఎగిసింది.

**ప్ర: విద్య వ్యాపారం కావడం వల్ల వస్తున్న నష్టం ఏమిటి? గ్రామీణ విద్యార్థుల పరిస్థితి ఏమిటి?**

డాక్టర్ కోదండ రామ్ యాదవ్: చాలా పెద్ద నష్టం. ఒకప్పుడు విద్యను సేవగా చూసేవారు. డాక్టర్ అంబేద్కర్ విద్యను సామాజిక సమానత్వానికి ఆయుధం అన్నారు. ఇప్పుడు విద్యను లాభాలు తెచ్చే వ్యాపారంగా చూస్తున్నారు. ప్రైవేట్ కళాశాలలు, కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పెరిగాయి. డబ్బు ఉన్నవాడికి సీటు, లేనివాడికి నిరాశ. అన్నిటికంటే ఎక్కువగా దెబ్బతింటున్నది గ్రామీణ, పేద విద్యార్థులు. వారికి ఆంగ్ల మాధ్యమం రాదు, పెద్ద కోచింగ్‌కు వెళ్లే స్తోమత లేదు. కానీ పరీక్ష మాత్రం అందరికీ ఒకే విధంగా ఉంటుంది. “విద్యను వ్యాపారం చేస్తే దేశ భవిష్యత్తును తాకట్టు పెట్టినట్లే”. ఈ అసమానతల వల్ల సమాజంలో అంతరాలు మరింత పెరుగుతున్నాయి.

**ప్ర: ప్రశ్నాపత్రాలు ఎలా లీక్ అవుతున్నాయి? వ్యవస్థలో లోపం ఎక్కడ ఉంది?**

డాక్టర్ కోదండ రామ్ యాదవ్: వ్యవస్థలో ప్రతి అడుగులోనూ రంధ్రం ఉంది. ప్రశ్నాపత్రం ముద్రించే చోటు నుంచి, దాన్ని తరలించే వాహనం వరకు, పరీక్షా కేంద్రంలోని గది వరకు అన్నీ భద్రతా లోపాలే. సాంకేతికతను హ్యాక్ చేయడం, పరీక్షా సిబ్బందే డబ్బుకు కక్కుర్తి పడడం, కోచింగ్ కేంద్రాలే సమాధానాలు చెప్పడం, నకిలీ అభ్యర్థులను కూర్చోబెట్టడం ఇలా పది రకాలుగా మోసం జరుగుతోంది. ఇది ఒక్క వ్యక్తి నేరం కాదు. ఇది పూర్తిగా వ్యవస్థాగత సంక్షోభం. పరీక్షలను నిర్వహించే సంస్థలు తమ బాధ్యతను సరిగా నిర్వర్తించడం లేదు. రాజకీయ జోక్యం, అధికారుల నిర్లక్ష్యం కూడా ఇందుకు కారణం.

**ప్ర: యువత చేస్తున్న “తిరిగి లేచే” ఉద్యమాన్ని మీరు ఎలా చూస్తున్నారు? దీని ప్రత్యేకత ఏమిటి?**

డాక్టర్ కోదండ రామ్ యాదవ్: ఇది చాలా గొప్ప పరిణామం. ఈ తరం యువతకు నాయకులు అవసరం లేదు. వారి చేతిలోని ఫోనే వారి ఆయుధం. వ్యంగ్యంతో, నినాదాలతో, శాంతియుతంగా తమ నిరసన తెలిపారు. “ఎంత తొక్కినా మళ్లీ లేస్తాం” అనే సంకేతం ఇచ్చారు. ఈ ఉద్యమ ప్రత్యేకత ఏమిటంటే ఇది కేవలం పరీక్షల గురించే కాదు. నిరుద్యోగం, ఫీజుల పెంపు, ప్రభుత్వ జవాబుదారీతనం, విద్యా వాణిజ్యీకరణ గురించి కూడా. గతంలోని ఉద్యమాలకు, దీనికి తేడా ఏమిటంటే యువత స్వయంగా నడిపింది. ఇలాంటి ఉద్యమాలు భవిష్యత్ రాజకీయాలకు దిక్సూచిగా నిలుస్తాయి. యువత మేల్కొంది.

**ప్ర: గతంలో జరిగిన ఇతర పరీక్షల లీకుల గురించి ఏమంటారు?**

డాక్టర్ కోదండ రామ్ యాదవ్: ఇది ఒక్క పరీక్ష సమస్య కాదు. గత పదిహేనేళ్లుగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఉపాధ్యాయ నియామకాలు, పోలీసు నియామకాలు, ఇతర ఉద్యోగ పరీక్షలు, పాఠశాల పరీక్షల్లో కూడా ఇదే తరహా ఘటనలు జరిగాయి. కొన్ని పరీక్షలు పూర్తిగా రద్దు కూడా అయ్యాయి. ప్రతి సంవత్సరం కొత్త కేసు, అదే తరహా మోసం. అంటే సమస్యను మనం తాత్కాలికంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాం తప్ప మూలాలను కత్తిరించడం లేదు.

**ప్ర: న్యాయస్థానాలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మీ అభిప్రాయం?**

డాక్టర్ కోదండ రామ్ యాదవ్: న్యాయస్థానం లక్షల మంది భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీర్పు ఇచ్చింది. కానీ “లీక్ జరిగింది కానీ పరీక్ష రద్దు చేయం” అనే తీర్పుతో ప్రజల్లో అనుమానాలు మిగిలాయి. ప్రభుత్వం దర్యాప్తులకు ఆదేశించడం, కమిటీలు వేయడం చేస్తోంది. కానీ ఇవన్నీ తాత్కాలిక ఉపశమనాలే. మంత్రి రాజీనామా కూడా నైతిక బాధ్యతతో కాకుండా ఆందోళనల ఒత్తిడితో జరిగింది. “ఆరోపణలతో రాజీనామాలు చేస్తే మంత్రులు ఉండరు” అన్న మాటలే ఈ వ్యవస్థ ఎంత కుళ్లిపోయిందో చెప్తున్నాయి. గతంలో నైతిక బాధ్యత అనేది ఒక సంప్రదాయం ఉండేది. ఇప్పుడు అది కనుమరుగైంది.

**ప్ర: కోచింగ్ కేంద్రాల పాత్రను మీరు ఎలా చూస్తారు?**

డాక్టర్ కోదండ రామ్ యాదవ్: కోచింగ్ కేంద్రాలు ఇప్పుడు వేల కోట్ల పరిశ్రమగా మారాయి. కొన్ని మంచి కేంద్రాలు నిజంగా విద్యార్థులకు సహాయపడుతున్నాయి. కానీ చాలా కేంద్రాలు వ్యాపార దృష్టితోనే నడుస్తున్నాయి. పరీక్షలకు ముందు ప్రశ్నలు ఇస్తామని, సీటు ఇప్పిస్తామని చెప్పి లక్షలు వసూలు చేస్తున్నాయి. వీటి చుట్టూనే మాఫియా ఏర్పడింది. ప్రభుత్వం వీటిపై నియంత్రణతేవాలి.లేకుంటేపాఠశాలవిద్య పూర్తిగా నిర్వీర్యం అవుతుంది.

**ప్ర: శాశ్వత పరిష్కారానికి మీ సూచనలు ఏమిటి?**

డాక్టర్ కోదండ రామ్ యాదవ్: ఐదు ప్రధానమైన పనులు చేయాలి. మొదటిది: ప్రభుత్వమే నాణ్యమైన ఉచిత విద్యను బాధ్యతగా తీసుకోవాలి. విద్యను మళ్లీ సేవగా మార్చాలి. రెండవది: పరీక్షా వ్యవస్థలో పూర్తి పారదర్శకత, సాంకేతిక భద్రత తేవాలి. అవినీతి చేసినవారిని ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలి. మూడవది: అవినీతిని బయటపెట్టే ఉద్యోగులు, విద్యార్థులకు పూర్తి రక్షణ ఇవ్వాలి. నాలుగవది: ఒకే పరీక్షపై యువత భవిష్యత్తును ఆధారపడకుండా బహుళ అవకాశాలు ఇవ్వాలి. ఐదవది: ప్రాంతీయ భాషా విద్యార్థులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాల విద్యను బలోపేతం చేయాలి.

**ప్ర: చివరగా యువతకు, తల్లిదండ్రులకు మీ సందేశం?**

డాక్టర్ కోదండ రామ్ యాదవ్: యువతా నిరాశ చెందవద్దు. మీ పోరాటం వృథా కాదు. చదువుతో పాటు సమాజంపై అవగాహన పెంచుకోండి. అన్యాయాన్ని ప్రశ్నించండి. “పరీక్షల పవిత్రత కాపాడకపోతే దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది”. తల్లిదండ్రులకు నా విన్నపం. పిల్లలపై అతిగా ఒత్తిడి తేవద్దు. ఒక్క పరీక్షే జీవితం కాదు. పిల్లల ప్రతిభను గుర్తించండి. మీరే ఈ దేశ భవిష్యత్తు. మీ గొంతును ఎవరూ అణచలేరు. కలిసి నిలబడి వ్యవస్థను మార్చండి.పరీక్షల్లో నిజాయితీ ఉంటేనే ప్రతిభకు విలువ. పాలనలో జవాబుదారీతనం ఉంటేనే ప్రజాస్వామ్యం బతుకుతుందనిడాక్టర్‌కోదండరామ్‌యాదవ్‌సందర్భంగా అన్నారు.


# హైదరాబాద్‌లో భారీవర్షంతో చెరువుల్లా మారిన రహదారులు - కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్




**హైదరాబాద్ :**నగరంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతం కాగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. మొదట రాజేంద్ర నగర్?లో ప్రారంభమైన వాన క్రమంగా నగరమంతా విస్తరిస్తూ వచ్చింది. అక్కడక్కడా భారీగా, కొన్ని చోట్ల మోస్తరుగా కురుస్తూ భాగ్యనగరాన్ని తడిపేసింది.ఒక్కసారిగా కురిసిన భారీవర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముషీరాబాద్?లో అత్యధికంగా 31 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.ట్రాఫిక్?జామ్?లో ఐటీ కారిడార్? : మాదాపూర్, గచ్చిబౌలి రాయదుర్గం ప్రాంతాల్లో సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వాన నీటితో రోడ్లు మునగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్, కేపీహెచ్?బీ మార్గంలో, మాదాపూర్ ఐకియా బయోడైవర్సిటీ మార్గంలో గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. కిలోమీటర్ దూరానికి గంట సమయం పడుతోంది.చెరువుల్లా మారిన రోడ్లు : రాజేంద్రనగర్, అత్తాపూర్, హైదర్‌గూడా, ఉప్పరపల్లి, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టడంతో రహదారులు జలమయమయ్యాయి. ఇదే సమయంలో కార్యాలయాలు ముగిసే వేళ కావడంతో రోడ్లపై నీరు నిలిచి చెరువుల్లా మారాయి. దీంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వర్షంలో తడుస్తూనే గమ్యస్థానాలకు : ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నెమ్మదిగా సాగగా, ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందిపడ్డారు. హైదర్‌గూడా టీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే ఫ్లైఓవర్ కింద, పిల్లర్ నంబర్--216 సమీపంలో రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది.రహదారులపై భారీగా నీరు : కేపీహెచ్‌బీ, నిజాంపేట్, బాచుపల్లి, ప్రాంతాల్లో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది. ట్రాఫిక్ సమస్యలతో చాలామంది మెట్రోను ఆశ్రయించారు. దీంతో మెట్రో రైళ్లు, స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కోఠిలో భారీ వర్షం పడడంతో రహదారులపై భారీగా నీరు చేరి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్‌లో అంబులెన్స్ కొద్దిసేపు చిక్కుకుపోయింది.మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వద్ద ట్రాఫిక్ జామ్ : దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో దంచికొడుతున్న వర్షంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, సరూర్ నగర్, కర్మాన్ ఘాట్, మలక్‌పేట్, చాదర్ ఘాట్ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షంతో పలు రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వరకు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వరకు వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి.అప్రమత్తంగా ఉండాలన్న ట్రాఫిక్ పోలీసులు : కార్యాలయాల నుంచి ఇళ్లకు బయలుదేరిన ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కొనసాగుతుండటంతో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని, వీలైతే ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. అప్రమత్తమైన హైడ్రా సిబ్బంది : భారీవర్షం ప్రారంభంకాగానే జీహెచ్ఎంసీ, ఫైర్, హైడ్రా సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచే ప్రాంతాల్లో వర్షపు నీటిని తొలగించే పనులను వేగవంతం చేశారు. నగరంలో వర్షాల ప్రభావం కొనసాగొచ్చని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.

# వ్యాసాయ విష్ణురూపాయ: జ్ఞానజ్యోతిని వెలిగించే పవిత్ర దినం

**వ్యాసుడు: కాలాన్ని దాటిన జ్ఞాన వటవృక్షం**
**గురు శబ్ద రహస్యం: అంతరంగంలోని చీకటిని చీల్చే కాంతి**
**గురు-శిష్య బంధం: ఒక దైవిక యజ్ఞం, ఒక పవిత్ర ఒప్పందం**
**కలియుగంలో గురువు: సవాళ్లు, సంక్షోభం మరియు అవసరం**
**గురు పౌర్ణమి: కేవలం పూజ కాదు, ఒక అంతరంగ యాత్ర**
**వ్యాసుని ఆశీర్వాదం మరియు మన బాధ్యత**






ఆషాఢ మాసం. వర్షాలు మొదలై భూమి తడిసి, కొత్త జీవం పుట్టుకొస్తున్న సమయం. ప్రకృతి అంతా పచ్చదనంతో కళకళలాడుతున్న ఈ శుభ మాసంలో వచ్చే పౌర్ణమికి మన సంస్కృతిలో అత్యంత విశిష్ట స్థానం ఉంది. ఆకాశంలో పూర్ణచంద్రుడు తన పదహారు కళలతో ప్రకాశిస్తున్న ఈ రోజును "గురు పౌర్ణమి" అని, "వ్యాస పౌర్ణమి" అని వేడుకగా జరుపుకుంటాం. ఇది కేవలం క్యాలెండర్‌లో ఒక తేదీ మాత్రమే కాదు. ఇది మానవుడు తన అంతర్గత చీకటిని చీల్చి, జ్ఞానం అనే సూర్యుడిని చూడడానికి చేసే పవిత్ర సంకల్పం. "గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్ దేవో మహేశ్వరః" అనే శ్లోకం ఈ రోజు ప్రతి గురుకులంలో, ప్రతి ఇంట్లో, ప్రతి హృదయంలో ప్రతిధ్వనిస్తుంది. ఎందుకంటే గురువు అంటే ఒక వ్యక్తి కాదు. అతడు సృష్టి, స్థితి, లయ అనే మూడు శక్తుల సమాహారం. బ్రహ్మలా కొత్త ఆలోచనలను సృష్టించేవాడు, విష్ణువులా మంచి విలువలను కాపాడేవాడు, శివుడిలా చెడు అలవాట్లను, అహంకారాన్ని నాశనం చేసేవాడు. ఈ పవిత్ర పౌర్ణమికి "వ్యాస పౌర్ణమి" అనే పేరు ఎలా వచ్చింది? దీని వెనుక ఒక మహా ఇతిహాసం ఉంది. కృష్ణద్వైపాయనుడు. పరాశర మహర్షి కుమారుడు. యమునా నది మధ్యలో ఉన్న ఒక ద్వీపంలో జన్మించిన కారణంగా "ద్వైపాయనుడు" అయ్యాడు. నల్లని వర్ణం కలిగి ఉండడం వల్ల "కృష్ణుడు" అయ్యాడు. అదే మహర్షి తరువాత "వేదవ్యాసుడు"గా లోకానికి వెలుగునిచ్చాడు. "వ్యాస" అంటే విస్తరించినవాడు. ఒకప్పుడు ఒకే వేదాన్ని నాలుగు వేదాలుగా, 18 పురాణాలుగా, ఉపపురాణాలుగా, మహాభారత ఇతిహాసంగా, బ్రహ్మసూత్రాలుగా విభజించి సామాన్య ప్రజలకు, స్త్రీలకు, శూద్రులకు కూడా అందుబాటులోకి తెచ్చిన మహానుభావుడు. వ్యాసుడు కేవలం రచయిత కాదు. అతడు ఒక సంస్థ. ఒక ఉద్యమం. అతడు చేసిన పని జ్ఞానాన్ని ప్రజాస్వామ్యపరం చేయడం. గురువు యొక్క మొదటి ధర్మం ఇదే. తన వద్ద ఉన్న అమూల్యమైన జ్ఞానాన్ని తాళం వేసి దాచుకోకుండా, ఒక వటవృక్షంలా వేలాది కొమ్మలు, వేలాది ఆకులుగా విస్తరించడం. అందుకే ఈ రోజు వ్యాసుడిని స్మరించుకోవడం అంటే గురు పరంపరకు, జ్ఞాన పరంపరకు మనం చేసే కృతజ్ఞతా నమస్కారం. వ్యాసుడు లేకుంటే మహాభారతం ఉండేది కాదు. భగవద్గీత ఉండేది కాదు. ధర్మాధర్మాల గురించి మనకు తెలిసేది కాదు."గురు" అనే రెండు అక్షరాల్లో విశ్వ రహస్యమంతా ఇమిడి ఉంది. "గు" అంటే గాఢాంధకారం. మనలోని అజ్ఞానం, అనుమానం, భయం, స్వార్థం, అహంకారం. "రు" అంటే రూపాన్ని నాశనం చేసేవాడు. ఆ చీకటిని పారద్రోలి, ఆత్మజ్ఞానం అనే సూర్యుడిని ఉదయింపజేసేవాడు. గురువు అంటే బయట నుండి వచ్చి మన తలపై చేయి వేసేవాడు కాదు. మనలోనే నిద్రపోతున్న గురుత్వాన్ని మేల్కొలిపేవాడు. గురువు అనేక రూపాల్లో మన జీవితంలోకి వస్తాడు. మనకు తొలి అక్షరం దిద్దిన ఉపాధ్యాయుడు గురువు. జీవితంలో తొలి దెబ్బ తగిలినప్పుడు ఓదార్చిన తల్లి గురువు. తప్పు దారి పడుతుంటే చెంపదెబ్బ కొట్టి సరైన దారిలో పెట్టిన తండ్రి గురువు. కష్టకాలంలో "నువ్వు సాధించగలవు" అని ధైర్యం చెప్పిన స్నేహితుడు గురువు. ఒక పుస్తకం, ఒక సంఘటన, ఒక ఓటమి కూడా మనకు గురువే కావచ్చు. అందుకే "గురు సాక్షాత్ పరబ్రహ్మ" అన్నారు. గురువును చూస్తే దేవుడు కనిపించాలి. పాశ్చాత్య విద్యా విధానంలో టీచర్ మరియు విద్యార్థి మధ్య సంబంధం ఒప్పందం ఆధారితం. ఫీజు ఇస్తాను, నువ్వు పాఠం చెప్పు. కానీ భారతీయ గురుకుల వ్యవస్థలో గురు-శిష్య సంబంధం ఒక యజ్ఞం. ఇందులో గురువు యజ్ఞకుండం, శిష్యుడు యజమాని. గురువు తన జ్ఞానాన్ని, తపస్సును, అనుభవాన్ని ఆ కుండంలో ఆహుతి ఇస్తాడు. శిష్యుడు తన అహంకారాన్ని, సోమరితనాన్ని, సందేహాలను సమిధలుగా వేస్తాడు. అప్పుడు ఉద్భవించేదే జ్ఞాన జ్వాల. ఈ బంధానికి మహాభారతమే నిదర్శనం. గురువు ద్రోణుడు అర్జునుడిని ప్రేమించాడు. కానీ కఠినంగా శిక్షణ ఇచ్చాడు. ఏకలవ్యుడు గురుదక్షిణగా తన బొటనవేలు ఇచ్చాడు. ఇది క్రూరత్వం కాదు. ఒక కళను, ఒక ధర్మాన్ని కాపాడడం కోసం చేసిన త్యాగం. కురుక్షేత్రంలో అర్జునుడు నిస్సహాయుడై కూర్చున్నప్పుడు కృష్ణుడు సారథిగా కాకుండా గురువుగా మారాడు. 18 అధ్యాయాల భగవద్గీతను బోధించాడు. అక్కడ గురువు చేసిన పని ఏమిటి? సందేహాన్ని పోగొట్టి, కర్తవ్యాన్ని గుర్తు చేయడం. నిజమైన గురువు నిన్ను ఓదార్చడు. నిన్ను నిలబెడతాడు. 21వ శతాబ్దంలో గురువు పాత్ర అత్యంత క్లిష్టంగా మారింది. ఒకవైపు సాంకేతికత. గూగుల్, చాట్‌జిపిటి, యూట్యూబ్. ఏ ప్రశ్నకు సమాధానం కావాలన్నా సెకన్లలో వస్తుంది. మరి గురువు అవసరం ఏముంది? కానీ ఇక్కడే మనం తప్పు చేస్తున్నాం. సమాచారం అంతా జ్ఞానం కాదు. పది లక్షల సమాచార ముక్కల్లో ఏది సత్యం, ఏది అసత్యం, ఏది నీకు ఇప్పుడు అవసరం, ఏది భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది అని వేరు చేసి చూపే వివేకం కావాలి. ఆ వివేకాన్ని ఇచ్చేవాడే గురువు. మరోవైపు విద్యా వ్యవస్థ వ్యాపారమయం అయింది. మార్కుల కోసం పరుగు. ర్యాంకుల కోసం ఒత్తిడి. ఫలితంగా విద్యార్థుల్లో డిప్రెషన్, ఆందోళన, ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. పాఠ్యపుస్తకాలు "ఫోటోసింథసిస్" చెప్పగలవు కానీ "జీవితం ఎందుకు బ్రతకాలి" అని చెప్పలేవు. ఇక్కడ గురువు ఒక కౌన్సెలర్‌గా, ఒక స్నేహితుడిగా, ఒక తండ్రిగా మారాల్సిన అవసరం ఉంది. నేటి గురువు పిల్లలకు కోడింగ్ నేర్పడంతో పాటు, కరుణను కూడా నేర్పాలి. సైన్స్‌తో పాటు సంస్కారాన్ని కూడా నేర్పాలి.గురు పౌర్ణమి రోజు ఉదయాన్నే లేచి, గురువు పాదాలకు నమస్కరించడం, పూలు సమర్పించడం మంచిదే. కానీ అది బాహ్య కర్మ. అసలైన పూజ అంతరంగంలో జరగాలి. ఈ రోజు మనం మనల్ని మనం మూడు ప్రశ్నలు ప్రశ్నించుకోవాలి. మొదటిది: నా జీవితంలో వెలుగు నింపిన గురువులు ఎవరు? వారికి నేను ఏమి ఇచ్చాను? ఒక ఫోన్ కాల్, ఒక కృతజ్ఞతా లేఖ చాలు. రెండవది: నేను ఎవరికైనా గురువుగా ఉన్నానా? నా అనుభవంతో, నా జ్ఞానంతో ఎవరికైనా సహాయం చేశానా? మూడవది: నేను ఏ కొత్త విద్యను నేర్చుకోవడానికి సంకల్పించుకుంటున్నాను? జ్ఞానానికి వయసు లేదు. ఈ రోజు పాత పుస్తకాలు దానం చేయడం, పేద విద్యార్థికి ఫీజు కట్టడం, ఎవరికైనా ఒక మంచి సలహా ఇవ్వడం అన్నీ గురు సేవే. "తమసో మా జ్యోతిర్గమయ" అనే ఉపనిషత్ మంత్రం ఈ రోజు మన ప్రార్థనగా ఉండాలి. చీకటి నుండి వెలుగులోకి, అసత్యం నుండి సత్యంలోకి, మృత్యువు నుండి అమృత్వంలోకి నడిపించమని గురువును ప్రార్థించాలి.వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే" అని మనం ప్రతిరోజు స్మరిస్తాం. వ్యాసుడు విష్ణువు. విష్ణువే వ్యాసుడు. ఎందుకంటే విష్ణువు లోకాన్ని రక్షిస్తాడు. వ్యాసుడు ధర్మాన్ని రక్షించాడు. గురువు కూడా అంతే. అతడు కేవలం ఒక సబ్జెక్ట్‌ను బోధించడు. ఒక తరాన్ని, ఒక సమాజాన్ని, ఒక దేశపు భవిష్యత్తును రక్షిస్తాడు. జీవితంలో గురువు లేకుండా మనం ముందుకు వెళ్లలేము. గురువు లేని జ్ఞానం గర్వంగా మారుతుంది. గురువు లేని భక్తి మూఢనమ్మకంగా మారుతుంది. గురువు లేని శక్తి విధ్వంసంగా మారుతుంది. ఈ పవిత్ర దినాన మన జీవితంలోకి వచ్చి, మనల్ని మనుషులుగా తీర్చిద్దిన ప్రతి గురువుకు పాదాభివందనం చేద్దాం. వారి ఆశీర్వాదంతో మనం కూడా ఇతరులకు ఒక వెలుగుగా, ఒక దిక్సూచిగా, ఒక గురువుగా మారే సంకల్పం తీసుకుందాం. అప్పుడే వ్యాసుని ఆశీర్వాదం, గురు పౌర్ణమి యొక్క నిజమైన ఫలితం మనకు దక్కుతుంది.

**వ్యాసకర్త: తలగాపు ఝూన్సీ వెంకటరమణ**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. 7995933607**

# నేనెక్కడికి పారిపోలేదు.. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి క్లారిటీ



**హైదరాబాద్:** రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఉదయ్ కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. 2 రోజులుగా ఉదయ్ కృష్ణారెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా.. హైదరాబాద్‌లోని రెండు అడ్రస్‌ల్లోనూ ఉదయ్ కృష్ణారెడ్డి కనిపించడం లేదని వార్తలు వచ్చాయి. పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పరారీలో ఉన్నాడని, ఫోన్ కూడా స్విచాఫ్ వస్తు ఒదన్న వార్తల నేపథ్య ంలో ఉదయ్ కృష్ణారెడ్డి స్పంది ంచాడుతాను ఎక్కడికీ పారిపోలే దని క్లారిటీ ఇచ్చాడు ఉదయ్ కృష్ణారెడ్డి . మా నానమ్మ అనారోగ్యంతో ఉన్నందుకు సొంతూరు ఊళ్లపాలెం వచ్చాను. న్యాయ, పోలీసు వ్యవస్థల మీద నమ్మకంతోనే విచారణకు హాజరవుతున్నా. నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటా. నా శాశ్వత చిరునామా ఊళ్లపాలెంకు ఎటువంటి నోటీసులు రాలేదని స్పష్టం చేశాడు. ఈ వ్యవ హారం కోర్టు పరిధిలో ఉంది కాబట్టి ఎక్కువ మాట్లాడలేనని పేర్కొన్నాడు ఉదయ్ కృష్ణారెడ్డి.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభం



**హనుమకొండ చౌరస్తా, జూలై 28:** డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026--27 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభమైనట్లు వరంగల్ ప్రాంతీయ సంచాలకులు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్, 10o2 అర్హత కలిగిన విద్యార్థులతో పాటు రెండేళ్ల పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు.డిగ్రీ ప్రవేశాల కోసం ఆధార్ కార్డు, గూజ, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం (అవసరమైన వారికి), పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో సమీప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రవేశాలకు ఆగస్టు 7 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ప్రవేశ నమోదు పూర్తి చేసి, తాము ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రంలో సంబంధిత ధ్రువపత్రాల ను సమర్పించాలని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-0101, ఫోన్ నంబర్లు 040-23680333, 040-23680444, 040-23680555లను సంప్రదించాలని జ్యోతి కోరారు.

# దూరు నుంచి జహీరాబాద్‌కు కొత్త రైల్వే లైన్



**జహీరాబాద్:**తాండూరు సిమెంట్ క్లస్టర్-జహీరాబాద్ మధ్య కొత్త రైల్వే లైన్ కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. తాజాగా దీని ఏర్పాటుకు కీలక ముందడుగు పడనుంది. ఈ రైల్వే లైన్‌కు సంబంధించిన క్షేత్రస్థాయి సర్వే ఇప్పటికే పూర్తయ్యింది. ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో సమగ్ర సర్వే చేపట్టారు. సర్వే నివేదిక ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే అధికారుల పరిశీలనలో ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ కొత్తలైన్‌తో జహీరాబాద్ వాణిజ్య ముఖచిత్రం కూడా మారనుంది.గేట్ రహిత ప్రయాణం : ఈ రైలు మార్గం అంచనా వ్యయం రూ. 1,350 కోట్ల నుంచి రూ. 1,400 కోట్లుగా సర్వేలో తేల్చారు. ఈ రైల్వే లైన్‌ను సుమారు 70 నుంచి 75 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు లేకుండా భవిష్యత్తులో ఈ మార్గం గుండా రైల్వే క్రాసింగ్ గేట్లు లేకుండా డిజైన్ చేశారు. వాహనాల రాకపోకలు కేవలం అండర్ బ్రిడ్జిలు, ఆర్వోబీల ద్వారానే సాఫీగా సాగేలా ప్రణాళికలు రూపొందించారు.స్టేషన్లు రానున్న ప్రాంతాలివే : ఈ కొత్త లైన్ ద్వారా పలు గ్రామాల్లో రైల్వే స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఎందుకంటే ఇది జహీరాబాద్, తాండూరు ప్రాంతాలను నేరుగా కలపనుంది. జహీరాబాద్, కోహీర్ మండలాల పరిధిలో శేఖాపూర్, మల్‌చెల్మ, గొడిగార్‌పల్లి, బడంపేటలో స్టేషన్ రానుంది. అలాగే వికారాబాద్ జిల్లాలో బంట్వారం, పెద్దేముల్, ఇందూరు, తట్టేపల్లి, కరణ్‌కోట, మల్కాపూర్, చల్కటూర్?లో రానుంది. అలాగే కర్ణాటకలోని కుంచవరం ప్రాంతాలను సైతం ఈ రైల్వేలైన్‌కు అనుసంధానం చేయనున్నారు.సరుకు రవాణాకు ఊతంగా : జహీరాబాద్ నుంచి తాండూరుకు రైలులో వెళ్లాలంటే ఇప్పుడు వికారాబాద్? మీదుగా వెళ్తున్నారు. దాదాపు 104 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. అంటే సుమారు 3 గంటల సమయం పడుతోంది. ఈ కొత్త లైన్? రాకతో ప్రయాణ సమయం ఏకంగా గంటన్నర దాకా ఆదా కానుంది. ఒకవేళ రోడ్డు మార్గంలో వెళ్లాలంటే రెండు రాష్ట్రాలు, రెండు జిల్లాల సరిహద్దులు దాటుతూ వెళ్తున్నారు. ఈ రైల్వే లైన్‌తో ఆ ఇబ్బందులు కూడా తొలగిపోనున్నాయి.

# నిండుకుండలా జూరాల ప్రాజెక్టు - ఎగువ నుంచి నీటి విడుదలతో జలకళ

**గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజె క్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో జూరా లలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. కృష్ణానదిపైనే ఈ ప్రాజెక్టును నిర్మించారు. జూరాల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.989 టీఎంసీలకు చేరింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి జూరాల జలాశయానికి 29,668 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోందని అధికారులు తెలిపారు. 27,210 వేల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ రిజర్వాయర్లకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోస్తున్న ట్లు అధికారులు వెల్లడించారు.ఉమ్మడి మహ బూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్?ఎస్? మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలను రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖల మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం ఒక ప్రకటన విడదల చేసి ఖండించారు. కృష్ణా నది జలాలపై మాట్లాడే హక్కు బీఆర్?ఎస్? పార్టీకీ లేదని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో కర్ణాటకలో డ్యాంలు కట్టినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని మంత్రి నిలదీశారు.బీఆర్?ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత బీఆర్?ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి వాకిటి శ్రీహరి మండిపడ్డారు. భీమా, కృష్ణా నదుల నీటిని నిల్వ చేసి సాగు, తాగునీరు అందించాలనే ఆలోచన కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్న ఆయన పొరుగు రాష్ట్రమైన కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ కృష్ణా, భీమా నదులపై బ్యారేజీ-కమ్-బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు వివరాలు సిద్ధం చేశామన్నారు. జూరాల ప్రాజెక్టు ముంపు గ్రామాలైన భూత్పూర్, అంకెనపల్లి, దాదంపల్లి, నేడుగం, అనుగొండ ప్రజల సమస్యలను దశాబ్దకాలంగా పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. ప్రస్తుతం ఆ గ్రామాల అభివృద్ధి, పునరావాసం, భూత్పూర్ డ్యాం విస్తరణ వంటి అంశాలపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. పాలమూరు జిల్లా ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, ప్లకార్డులు పట్టుకుని రాజకీయ డ్రామాలు చేయడం చేస్తే వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వాకిటి పేర్కొన్నారు.సాగర్? ఆయకట్టు రైతుల్లో ఆందోళన : మరోవైపు నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులు జలాశయం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం మొత్తం నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 513.10 అడుగులుగా ఉంది. ఇది డెడ్ స్టోరేజ్‌కు దగ్గరలో ఉందని అధికారులు చెబుతున్నారు. సాగర్ జలాశయం మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 136 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 900 క్యూసెక్కుల నీరు ఇన్?ఫ్లోగా వస్తుంది. హైదరాబాద్ తాగు నీటి కోసం 900 క్యూసెక్కుల నీటిని ఔట్?ఫ్లోగా విడుదల చేస్తున్నారు. ఎల్?నినో ప్రభావంతో సాగర్ ఆయకట్టు రైతులు పంటలకు సాగు నీరు వస్తుందా రాదా? అనే ఆందోళనలో ఉన్నారు. గత ఏడాది జులై మాసం చివరి నాటికి వర్షాలు అధికంగా కురవడంతో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు సాగు నీటిని విడుదల చేశారని గుర్తు చేసుకుంటున్నారు.

# సాగర్ నీటితో చెరువులు నింపాలి



**అనంతగిరి, జూలై 28 :** సాగర్ నీరు ఖమ్మం జిల్లాకు తరలిపోతున్నా జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చోద్యం చూస్తున్నారని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. మంగళవారం అనంతగిరి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు ధ్యేయంగా స్వరాష్ట్ర సాధన జరిగిందని, సొంత రాష్ట్రంలో కూడా జిల్లాకు మొండి చేయి చూపి పాలేరుకు జలాలు తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తమ్ దంపతులకు రైతుల గోస కనిపించడం లేదన్నారు. గతంలో కూడా జిల్లాలోని కాల్వ తూములను సీజ్ చేసి ఖమ్మం జిల్లాలకు నీటిని తరలించుకుపోయారని, తర్వాత వరద నీటితో తూముల్లో నీరు పారక కాల్వలకు గండ్లు, చెరువులు తెగిపోయి గ్రామాలు ముంపునకు గురైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

# మా దగ్గర తీసుకున్న కమీషన్ ఇచ్చేయండి




**హైదరాబాద్:**ఒకే పనికి రెండుసార్లు బిల్లులు చెల్లించిన అధి కారులకు ఇప్పుడు కాంట్రాక్టర్లు ఝలక్ ఇస్తున్నారు. అవినీతి జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో అడ్డదారిలో వెళ్లిన ప్రజా ధనాన్ని రికవరీ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. అయితే రెండో బిల్లులో తీసుకున్న 10 శాతం కమీషన్ డబ్బును అధికారులూ తిరిగివ్వాలని కాంట్రా క్టర్లు పట్టుబడుతున్నారు. అలాగే జీహెచ్‌ఎంసీ అడుగుతున్న వడ్డీ డబ్బును చెల్లించలేమని చెబుతున్నారు.బల్దియా చరిత్రలో మొదటిసారి : కమీషన్, వడ్డీ డబ్బుతో కాంట్రాక్టర్లు రికవరీ ప్రక్రియపై మెలిక పెట్టడంతో శాఖాపరమైన చర్యల పేరుతో ఫైనాన్స్ విభాగం 78 మంది లైసెన్సులను హోల్డ్?లో పెట్టింది. ఆయా కాంట్రాక్టర్లకు ఇకపై జీహెచ్‌ఎంసీ ద్వారా బిల్లుల చెల్లింపు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంది. జీహెచ్?ఎంసీ చరిత్రలో ఇంత మంది కాంట్రాక్టర్లపై ఒకేసారి చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.కమిషనర్ లేఖలతో : అనారోగ్యం, తమ పిల్లల వివాహం, ఇతరత్రా అత్యవసర కారణాలు చూపుతూ తమకు వెంటనే బిల్లులు చెల్లించాలని అభ్యర్థిస్తూ కొందరు గుత్తేదారులు జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్??కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. దీంతో కొన్నింటిని కమిషనర్ పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో ఆయా గుత్తేదారులకే రెండుసార్లు వర్క్? బిల్లుల చెల్లింపు జరిగింది. దీనికి కారణం కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటమేనని తెలుస్తోంది.ఏళ్లకు ఏళ్లుగా ఫైనాన్స్ విభాగంలో పని చేస్తోన్న పొరుగు సేవల సిబ్బంది కమిషనర్ సిఫార్సును సొమ్ము చేసుకున్నాడు. కమిషనర్ సిఫార్సు లేఖ ఆయా కాంట్రాక్టర్ల బిల్లులను వరుస క్రమంలోనూ కొనసాగించారు.

## డీఎస్సీపై బహిరంగ చర్చకు రండి.. వైసీపీ నేతలకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి సవాల్



**విశాఖపట్నం, జులై 28:** వైసీపీ నేతలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు. డీఎస్సీపై మంత్రి నారా లోకేశ్ విసిరిన సవాల్‌ను వైసీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే స్వీకరించాలన్నారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని జగన్, వైసీపీకి ఛాలెంజ్ చేశారు. జగన్, ఆయన టీంకు బుద్ధి లేదని.. ప్రజలకు మంచి చేస్తున్నా కూడా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. లోకేశ్ విద్యాశాఖ మంత్రి అయ్యాకే.. విద్యారంగంలో సంచలనాత్మక నిర్ణయాలు తీసుకున్నారని.. పెనుమార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. లోకేశ్‌ను వైసీపీ నేతలు రాజీనామా చేయమనడం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేలకు పైగా టీచర్ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన కుటుంబాలను వైసీపీ నేతలు అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి హయాంలో ప్రభుత్వ, వస్తున్నా యన్నారు. ఏపీ బ్రాండ్‌ను చెడగొట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇదే పద్ధతిలో వైసీపీ వెళ్తే.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి 11 సీట్లు కూడా రావని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## తమ్మినేని సీతారాం తనయుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**అమరావతి, జులై 28:** ఫోర్జరీ పత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న కేసులో వైఎస్సార్సీపీ నేత తమ్మినేని సీతారాం కుమారుడు వెంకట శ్రీరామ్ చిరంజీవి నాగ్‌కి హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేమని కోర్టు స్పష్టం చేసింది. సొంత సొమ్ముతో ప్లాట్లు కొన్నారని నిరూపించడంలో ఆయన విఫలమయ్యారని పేర్కొంది. మధ్యంతర ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరిస్తూ ఆయన వేసిన అనుబంధ పిటీషన్‌ను కొట్టివేసింది. కేసులో తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణికి తాత్కాలిక మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం విచారణాధికారి ముందు హాజరు కావాలని తమ్మినేని సీతారాంను ఆదేశించింది. హైకోర్టులో ఎదురుదెబ్బ: భూయజమాని బతికి ఉండగానే మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించడం, కోట్లు విలువైన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారంపై నమోదైన కేసులో తమ్మినేని సీతారాం తనయుడు నాగ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అరెస్ట్ నుంచి రక్షణ



కల్పించాలని మధ్యంతర ముందస్తు బెయిలివ్వాలని నాగ్ చేసిన అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఆయన దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. ఇదే కేసులో ఏ-6గా ఉన్న తమ్మినేని సీతారాం, ఏ-7 గా ఉన్న ఆయన సతీమణి వాణికి తాత్కాలిక మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తదుపరి విచారణ వరకూ వీరిద్దరినీ అరెస్ట్ చేయొద్దని దర్యాప్తు అధికారికి సూచించింది. మరోవైపు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు ఐవో ముందు హాజరుకావాలని తమ్మినేని సీతారాంను ఆదేశించింది. దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరవుతూనే ఉండాలని తేల్చిచెప్పింది. దర్యాప్తునకు సహకరించకపోతే మధ్యంతర ముందస్తు బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరించింది. వాణి విచారణ విషయంలో చట్ట నిబంధనలను పాటించాలని ఐవోకు సూచించింది. ప్రధాన బెయిల్ పిటిషన్‌పై విచారణ ఆగస్టు 17కి వాయిదా వేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. సివిల్ దావా: తన స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించారని కట్టా జయకిశోర్ అనే వ్యక్తి రెండున్నరేళ్ల కిందటే నాగ్‌పై సివిల్ కోర్టులో దావా వేశారని న్యాయమూర్తి తెలిపారు. ఆ స్థలాన్ని తిరిగి తనకు అప్పగించాలని కోరినట్లు వెల్లడించారు. ఈ దావాలో తమ్మినేని సీతారాం, ఆయన సతీమణి వాణిని ప్రతివాదులుగా పేర్కొనలేదన్నారు. సీతారాం, ఆయన భార్య స్థలం కొనుగోలు చేస్తున్నట్లు దస్తావేజులు రాయించుకోలేదని తెలిపారు. సేల్ డీడ్‌లో వారిద్దరూ సాక్షులు కాదన్నారు. జయకిశోర్ తాజాగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సివిల్ దావా వేసినట్లు, అది పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించకుండా గోప్యంగా ఉంచారని చెప్పారు. దావా వేసిన రెండున్నరేళ్ల తర్వాత తాజాగా ఇచ్చిన ఫిర్యాదులోనూ సీతారాం, ఆయన భార్య పాత్రల గురించి స్పష్టంగా పేర్కొనలేదని గుర్తుచేశారు. వారిరువురి వ్యక్తిగత స్వేచ్ఛ, వారిపై ఆరోపణలు, నిష్పాక్షిక దర్యాప్తు మధ్య సమతుల్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వారిద్దరిని అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశిస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. రజని అనే మహిళ నుంచి మూడు ప్లాట్లు కొనుగోలు చేసినందుకు సొమ్ము చెల్లించినట్లు ప్రాథమిక ఆధారాలను కోర్టు ముందు ఉంచడంలో వెంకట శ్రీరామ్ చిరంజీవి నాగ్ విఫలమయ్యారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కేసులో ఆయనపై ఆరోపణలు తీవ్ర మైనవిగా ఉన్నాయని ఈ నేపథ్యంలో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలనే అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు న్యాయమూర్తి

## ‘2029లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తాయన్నాను.

**అమరావతి, జులై 28:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ‘అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తోందన్నారు మంత్రి నారా లోకేష్ . ఈ రెండేళ్లలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకొచ్చామన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో పర్యటించిన లోకేష్.. ‘రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం’ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తలతో సమావేశంలో ఓ ఆసక్తికర విషయాన్ని చెప్పారు మంత్రి లోకేష్. ఇటీవల ఢిల్లీలో జాతీయ మీడియాతో మాట్లాడిన సమయంలో తాను చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు చెప్పుకొచ్చారు. 2029 ఎన్నికల్లోనూ టటీడీపీ, జనసేన, బీజేపీ కలిసే పోటీ చేస్తాయని తాను జాతీయ మీడియాతో చెప్పానని.. వెంటనే జనసేనాని పవనన్న ఫోన్ చేసి 2029 ఎన్నికలను ప్రస్తావించావేంటి? అంటూ తనను ప్రశ్నించినట్లు టీడీపీ కార్యకర్తలతో చెప్పుకొచ్చారు. ఈసారి చెప్పేటప్పుడు.. ఏపీలో 15 ఏళ్లపాటు కూటమి బంధం కొనసాగుతుందని చెప్పమని తనపై కోప్పడ్డారని లోకేష్ గతంలో జరిగిన విషయాన్ని



గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే.. వైఎస్సా ర్‌సీపీ ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఈ ఆరోపణలపై జగన్‌తో చర్చించేందుకు తాను సిద్ధమని లోకేష్ సవాల్ చేశారు. మెగా డీఎస్సీ విషయంలో జగన్ బహిరంగ చర్చకు రావాలన్నారు లోకేష్. టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చేస్తే తాను ఒక్కడినే వస్తానన్నారు. తాము పారిపోయే టైప్ కాదు.. అలాగే వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన మద్యం, భూకుంభకోణాలపైనా జగన్ బహిరంగ చర్చకు రావాలని ఛాలెంజ్ చేశారు. జగన్ ప్రభుత్వంలో ఒక్క టీచర్ పోస్ట్ కూడా భర్తీ చేయలేదని.. పైగా కూటమి ప్రభుత్వం డీఎస్సీ ఇస్తే 150 కేసులు వేసి జగన్ అండ్ కో అడ్డుకోవాలని చూసి ందన్నారు. జగన్ కొంతకాలంగా క్రెడిట్ చోరీ డిజార్డర్ (సీసీడీ) అనే వ్యాధితో బాధప డుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి రాష్ట్రా నికి తీసుకొచ్చిన పరిశ్రమలు, కంపెనీలను తానే తెచ్చానని చెప్పుకోవడం ఈ జబ్బు లక్షణమని సెటైర్లు పేల్చారు. టీడీపీ కార్యకర్తలకు, కుటుం బాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు లోకేష్ చెప్పుకొచ్చారు. అందుకే మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులకు రక్తపరీక్షలు చేశామని.. వారిలో 75 శాతం మందికి బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ ఉన్నట్లు తేలిందన్నారు. అందుకే ప్రతి నియోజకవర్గంలో టీడీపీ నేతలకు వైద్య పరీక్షలు చేయించి.. ఉచితంగా మందులు అందించే కార్యక్రమం చేపడతాము అన్నారు. స్థానిక ంగా కేడర్ పనిచేయాలని.. కూటమి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజాప్రభుత్వం పెద్దఎత్తున అమలు చేస్తోందన్నారు.

## 29 వేల రేషన్ దుకాణాలు మరింత బలోపేతం:



**ఢిల్లీ, జులై 28:** ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖలో చేపడుతున్న సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించిందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడలో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)లో స్టీమ్ రైస్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. అదనంగా 20 వేల మెట్రిక్ టన్నుల పార్బాయిల్డ్ ధాన్యం సేకరణకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. రేషన్ దుకాణాల ద్వారా ‘మీ మార్ట్’ కాన్సెప్ట్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. రైతు బజార్లలో తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని విక్రయించే కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఏపీ వ్యాప్తంగా స్వర్ణ వెరైటీ బియ్యాన్ని కిలో రూ. 40కు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రేషన్ కార్డుదారులకు 500 గ్రాముల కందిపప్పు అందించే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ. 281 కోట్ల నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ధాన్యం ట్రాకింగ్‌కు ఆర్ఎఫ్ఐడీ టెక్నాలజీనిరాష్ట్రంలోని 29 వేల రేషన్ దుకాణాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో బియ్యం ధరల స్థిరీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. మిల్లర్లతో చర్చలు జరిపామని, ప్రస్తుతం కిలో రైస్ ధర రూ. 52 వద్ద ఉండేలా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ వెరైటీ రైస్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## కృష్ణా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. తిరుమల విద్యాసంస్థల చైర్మన్ సోదరుడు మృతి



**కృష్ణా జిల్లా:** బాపులపాడు మండలం బొమ్మలూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఆగివున్న లారీని ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మరణించగా.. అతని భార్య తీవ్రంగా గాయపడింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుడిని రాజమహేంద్రవరం పట్టణానికి చెందిన తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు సోదరుడు నున్నా సురేశ్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన అతని భార్యను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ యాక్సిడెంట్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నున్నా సురేశ్ దంపతులు విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

## అవకాశాలు సద్వినియోగం చేసుకోండి.. యువతకు నారా భువనేశ్వరి పిలుపు

**చిత్తూరు, జులై 28:** అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని యువతకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. వివేకవంతమైన ఆలోచనలతో నిర్ణయాలు తీసుకోవాలని వారికి సూచించారు. కుప్పం పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం స్థానిక పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో నారా భువనేశ్వరి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల క్రీడలను వీక్షించారు. అలాగే క్విజ్ పోటీలో పలు ప్రశ్నలను విద్యార్థులను ఆమె అడిగారు. అనంతరం నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థులతో కలిసి క్విజ్ పోటీ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. కుటుంబం ఇబ్బందుల్లో ఉంటే తల్లిదండ్రులకు పిల్లలు అండగా నిలవాలని సూచించారు. మంచి వ్యక్తులతో స్నేహం మన ఉన్నతికి దోహదపడుతుందని తెలిపారు. తన మనవడు దేవాన్ష్ పుస్తకాలు బాగా చదువుతాడని.. టీవీ, మొబైల్‌కి దూరంగా ఉంటాడని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు



అత్యుత్తమ విద్యను అందిస్తున్నాయని వివరించారు. విద్యార్థుల చదువుకు చేయూత అందించేందుకు మన ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ఒక్కో బిడ్డకు రూ. 15,000 ఆర్థిక సాయాన్ని అందిస్తోందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషితో ప్రైవేటు నుంచి 1.06 లక్షల మంది విద్యార్థులు మళ్లీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని సోదాహరణగా వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువతకు నారా భువనేశ్వరి సూచించారు. డ్రగ్స్‌తో జీవితాలు నాశనమవుతాయని.. వ్యసనాల నుంచి బయటపడటం చాలా కష్టమని అన్నారు. పరీక్షల్లో విఫలమవడం జీవితానికి ముగింపు కాదని పేర్కొన్నారు. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. అలాంటి చర్యల వల్ల కన్నతల్లిదండ్రులు కుంగిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని.. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమన్నారు. గురువులు మార్గదర్శకులని.. వారిని గౌరవించాలని విద్యార్థులకు నారా భువనేశ్వరి సూచించారు. జాతిపిత మహాత్మాగాంధీ, ప్రధాని నరేంద్రమోదీ వంటి వారి నుంచి స్ఫూర్తి పొందాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. మహాత్మునిలా సమాజానికి సేవ చేసే గుణం అలవరుచుకోవాలని విద్యార్థులతో అన్నారు. యువత చేతిలోనే మన దేశ భవిష్యత్ ఉందని గుర్తు చేశారు. మీరంతా ఎంచుకున్న రంగంలో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారికి సూచించారు. లక్ష్యంతో ముందుకెళ్తే టీచర్, ఇంజినీర్, డాక్టర్, బిజినెస్ మ్యాన్, పోలీస్, ఐఏఎస్, ఐపీఎస్ ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు స్పష్టం చేశారు. దేశ రక్షణలో పోలీసుల సేవలు అమూల్యమైనవని అభివర్ణించారు. క్రమశిక్షణతో జీవిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని విద్యార్థులతో నారా భువనేశ్వరి పేర్కొన్నారు.

## నత్తనడకన ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ - అధికారుల నిర్లక్ష్యంతో ముందుకు సాగని పనులు

**ఎన్టీఆర్‌జిల్లా:** రాష్ట్రంలో వేలాది మంది ఎదురుచూస్తున్న ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌ల పనులు ఇప్పటికీ నత్త నడకనే సాగుతున్నాయి. పనులు పూర్తయితే దాదాపు 8 వేల ప్లాట్లు అందుబాటులోకి వస్తా యి. ప్రభుత్వానికి 13 వందల కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో తీవ్ర జాప్యం: రాష్ట్రంలోని 9 నగరాల్లో అభివృద్ధి చేస్తు న్న ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ లేఔట్ల పరిస్థితి ఇంకా అసంపూర్తిగానే ఉంది. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ టౌన్‌షిప్‌ల పేరుతో ప్రార ంభించిన



ఈ ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లుగా పేరు మార్చి పూర్తి చేయాలని నిర్ణయించింది. అయితే 32 లేఔట్లలో చాలా చోట్ల పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. కొన్ని లేఔట్లలో 85 నుంచి 90 శాతం పనులు పూర్తయినా, మరికొన్ని చోట్ల 20 శాతం కూడా పూర్తి కాలేదు. రోడ్లు, తాగునీరు, మురుగునీటి పారుదల, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ లేఔట్ల అభివృద్ధి పూర్తయితే మొత్తం 7 వేల 949 ప్లాట్లు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే నిర్ణయించిన ధరల ప్రకారం విక్రయించినా ప్రభుత్వానికి సుమారు 13 వందల 37 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం 12 వందల 99 ఎకరాల్లో 13 వేల 114 ప్లాట్లను అభివృద్ధి చేయా లని ప్రణాళిక రూపొందించగా ఇప్పటివరకు పూర్తిగా చెల్లింపులు చేసిన లబ్ధిదారులకు 5 వేల 163 ప్లాట్లు మాత్రమే కేటాయించారు. అధికారుల నిర్లక్ష్యంతో ముందుకు సాగని పనులు: అసంపూర్తిగా ఉన్న మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేయడానికి సుమారు 500 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. విశాఖ, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థల వద్ద నిధుల కొరత లేకపోయినా పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక గతంలో దరఖాస్తు చేసి డబ్బులు చెల్లించని వారి పేర్లను జాబితాల నుంచి తొలగించి ఖాళీ అయ్యే ప్లాట్లను ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా వేలం వేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే లేఔట్లలో మౌలిక సదుపాయాల పనులు పూర్తి కాకపోవడంతో ఆ ప్రతిపాదన కూడా ఇంకా అమల్లోకి రాలేదు.

## బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం



**అమరావతి, జులై 28** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడింది.. ప్రస్తుతం ఉత్తరం వైపు పయనిస్తూ ఒడిశాలోని బాలాసోర్, పశ్చిమ బెంగాల్‌లోని హల్దియా మధ్య కేంద్రీకృతమై ఉంది. ఇవాళ హల్దియాకు సమీపంలో తీరం దాటనున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. వాయుగుండం తీరం దాటనుండటంతో కళింగపట్నం నుంచి కాకినాడ వరకు ఉన్న ఓడరేవుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కోస్తాలోని ఓడరేవుల్లో ఒకటో నంబరు హెచ్చరికను జారీ చేశారు. ఈ వాయుగుండం ప్రభావంతో నేడు ఉత్తరాంధ్రలోని పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలు.. కోస్తా ప్రాంతంలోని పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందంటున్నారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం.. కోస్తాలోని బాపట్ల.. రాయలసీమలోని తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వానలు పడతాయంటున్నారు. అలాగే మత్స్యకారులు బుధవారం వరకు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచిస్తున్నారు. అలాగే ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వీచే సమయంలో చెట్లు, హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాల కింద నిలబడకూడదని సూచించారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com